# చినుకై

కురవని మేఘాల గుండెలు

మొలవని గింజల ఎడారి పాదాలు

నైరుతి పాట గాయం చేసినా తట్టుకున్న పోరాటాలున్నాయి మాకు

కానీ మా రాజు చేసిన జలవాగ్దానాల

నెత్తుటి స్రావాలు, కళ్ళల్లో పొంగుతూనే వున్నాయి.

బిందు బిందువుగా కురిసే జొన్న విత్తుల కోసం

కన్ను కాసీ కాసీ పక్కటెముకలన్నీ

అరిగిపోతూనే ఉన్నాయి.

కల్లం పగిలిపోతూనే వుంది.

రాత్రుల పర్యంతాలూ ఎకరంన్నర చెల్కలో

నిశ్శబ్దంగా రోదించిన నాకు,

తంగేడు పొదల వోదార్పే తోడు,

నన్ను పోలిన నీడలే ఎక్కడయినా....

'వాన' కనబడని మా నాయనమ్మ

'పంట' మాయమ్మ చెప్పిన గుబ్బం కథ

బీళ్ళల్లో తోడేళ్ళు నిలబడి దాహాలని ఎగదోస్తూనే వున్నాయి

ఉరేసుకున్న మా అన్నా...

కడుపుతో వున్న నా బిడ్డా...

గుడిసె దాటంగానే తోడొచ్చే నా నీడా...

వీళ్ళందరి వెనుకా ఒక అస్పష్ట మృత్యువు

ఆకాశంలో కనబడిన నల్లటి పక్షి

చినుకుల్ని విదిలించకుండానే ఆత్మహత్య చేసుకుంది

రాని చినుకు కోసం మా ఊరి గుమ్మంలో,

మూటగట్టిన అవశేషాలతో,

నేనూ...

నా భూమి

సిద్ధార్థ<br>(దీపశిల – 1994)